జీడిమెట్లలో గలీజు దందా..!

- చెలరేగిపోతున్న మెడికల్ వ్యర్థాల మాఫియా
- ప్రతిరోజూ లక్షల్లో వ్యాపారం
- ఎస్వీకో ఆపరేటివ్ సొసైటీ అడ్డాగా పనులు
- పట్టించుకోని ఐలా, పీసీబీ, పోలీస్ అధికారులు
- బీహారీ కూలీలతో పనిచేయిస్తున్న వైనం
- వసూళ్ల దందాలో కిందిస్థాయి అధికార సిబ్బంది..!


డేంజర్ లేబుల్‌తో కనిపిస్తున్న సీసా




మెడికల్ వేస్టును వేరు చేస్తున్న బీహారీ కూలీలు..


శుభ్రపరిచిన మెడికల్ వేస్ట్‌ను లోడ్ చేస్తున్న కూలీలు

జీడిమెట్ల: అది జీడిమెట్ల పారిశ్రామికవాడలో ఒక వింగ్.. అక్కడికి వెళ్లి చూస్తే ఒక్కో గోదాంలలో టన్నుల కొద్దీ మెడికల్ వ్యర్థాలు కనిపిస్తాయి.. పరిశీలించి చూస్తే కానీ అక్కడ జరుగుతున్న తంతు అర్థం కాదు. ఒకవేళ కొత్త వ్యక్తి అక్కడకు వెళ్లి గమనించాలని చూస్తే కొందరు అనుమానితులు మనల్ని ఫాలో చేస్తుంటారు.. ఇదీ సినిమాలో మాదిరిగా ఒక మాఫియా అడ్డాలో అడుగుపెట్టినట్లుగా ఉంటుంది అక్కడ వాతావరణం. అక్కడ పనిచేసే కార్మికులు సైతం వారు అక్కడ ఏం పని చేస్తున్నారో కూడా తెలియకుండా పొట్ట కూటి కోసం వారు చెప్పిన పని చేస్తుంటారు. ఇక్కడ దందా నిర్వహించే బడాబాయ్‌లు మాత్రం గలీజు దందా ద్వారా లక్షల రూపాయలు గడిస్తూ తమ వ్యాపారాన్ని చక్కగా సాగిస్తున్నారు. ఇదంతా ఎక్కడో కాదు అసియా ఖండంలోనే అతిపెద్ద పారిశ్రామికవాడగా చెప్పుకునే మన జీడిమెట్లలోని ఎస్వీకో ఆపరేటివ్ సొసైటీలోనే.

అసలు ఇక్కడ ఎలాంటి దందా జరుగుతుంది..

ఎస్వీకోఆపరేటివ్ సొసైటీలోని ఈ ప్రాంతానికి వివిధ ప్రాంతాల నుంచి మెడికల్ వేస్ట్ తీసుకువస్తారు. వాటిలో ఆపరేషన్ థియేటర్లలో వాటిపడేసిన గ్లౌజెస్, ఇంజెక్షన్ సిరంజీలు, సీజర్స్, మల, మూత్ర, రక్త పరీక్షలు నిర్వహించిన శాంపిల్ డబ్బాలు, రసాయనాల సీసాలు ఉంటాయి. వీటిని ఇక్కడకు తీసుకు వచ్చి శుభ్రపరచి వాటిని వేరు చేసి ప్రతిరోజు పెద్దపెద్ద వాహనాల్లో ఇతర ప్రాంతాలకు పంపిస్తారు. చూడటానికి గలీజు దందాల కనిపించిన ఒక్కడ ప్రతిరోజు లక్షల్లో వ్యాపారం జరుగుతోంది.

పొట్టకూటి కోసం వచ్చిన బిహారీలే వీరి కూలీలు..

ఇక్కడ ప్రతినిత్యం పనిచేసేవారంతా బీహార్ రాష్ట్రానికి చెందిన నిరక్ష్యరాస్యులైన కూలీలు. వీరిలో ఆడవారికి రూ.350, మగవారికి రూ.700 చొప్పున రోజువారి కూలీ చెల్లిస్తారు. దీంతో మెడికల్ వేస్ట్‌పై అవగాహనలేని కూలీలు ఇక్కడ పనులు చేస్తుంటారు. వీరికి ఎలాంటి జబ్బులు వచ్చిన అడగరు. రోజువారి కూలీ కాబట్టి యజమానులకు సైతం ఎలాంటి ఇబ్బంది ఉండదు. కూలీలకు ఈఎస్‌ఐ, పీఎఫ్‌లాంటి సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం అసలే లేదు. దీంతో వీరి వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతోంది.

అధికారులు పట్టించుకోరా..?

ఇక్కడ జరుగుతన్న మెడికల్ వేస్ట్ దందా గురించి ప్రతి ఒక్కరికీ తెలుసు. అయినప్పటికి ఎవరూ పట్టించుకోరు. పీసీబీ, ఐలా, పోలీస్, ఎవరూ దీనిని పట్టించుకోరు. అసలు వీరికి అనుమతులు ఉన్నాయా లేవా కూడా ఎవరు ఆరాతీయరు. ఒకవేళ అధికారులను అడిగితే కింది స్థాయి సిబ్బంది చూస్తున్నారు మాకేం తెలియదు అంటూ తప్పించుకుంటారు. దందా నిర్వహించే వారికి పీసీబీ అనుమతులు గాని ట్రేడింగ్ లాంటి అనుమతలు ఏమి ఉండవు కాని వీరి దందా మాత్రం సజావుగానే సాగుతుంటుంది. అసలు ఇలాంటి గలీజు దందాను అధికారులు సంయుక్తంగా దాడులు చేసి మూసి వేయాల్సింది పోయి ఒకరిపై ఒకరు నెట్టుకుంటున్నారు. కేవలం ఐలా అధికారులు మాత్రం ప్లాట్ ఉన్నందు ను వారికి ఆస్తి పన్ను వేసి డబ్బు వసూలు చేసి మిన్నకుండిపోతున్నారు.

అధికారుల కనుసన్నల్లోనే దందా ..!

అసలు ఇక్కడ జరిగే ఈదందా మొత్తం అధికారులకు తెలిసే జరుగుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇక్కడ దందా నిర్వహించేవారు ఐలా, మున్సిపల్, పోలీస్, పీసీబీ అధికారులతో టచ్‌లో ఉండి దందా నిర్వహిస్తారని ఆరోపిస్తుండగా మరికొంత మంది ఇక్కడకు అధికారుల కిందిస్థాయి సిబ్బంది వచ్చి వసూళ్లకు పాల్పడతారని కొంత మంది తీవ్రంగా ఆరోపిస్తున్నారు. ఏదీఏమైనా ఇక్కడ జరుగుతున్న మెడికల్ వేస్ట్ దందాను ఆపివేయకుంటే ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తామని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు


మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు


దేవేందర్‌నగర్‌లో జరిగిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: 'మిలాద్ ఉన్ నబి' వేడుకలను గురువారం ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. రోడామేస్త్రి నగర్ 'మజీద్ అక్సా', మగ్దూంనగర్, దేవేందర్ నగర్‌లలో జరిగిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ సీనియర్ నేత కూన శ్రీశైలం గౌడ్ పాల్గొనగా, రోడా మేస్త్రీనగర్ హాజీఅలీ మజీద్‌లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వివేకానంద్ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త ప్రపంచంలో శాంతిని నెలకొల్పేందుకు ఇస్లాం మతాన్ని స్థాపించారని కొనియాడారు. కాంగ్రెస్ నాయకులు జహంగీర్ భాయ్, బండి శ్రీనివాస్ గౌడ్, సయ్యద్ రషీద్, చింతల్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మహమ్మద్ రఫీ, మజీద్ అధ్యక్షుడు సదర్ రషీద్, ఉస్మాన్, మసీద్ ఇమామ్ సయ్యద్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.


రోడామేస్త్రీనగర్‌లో జరిగిన వేడుకల్లో ప్రార్థనలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

మున్సిపల్ కార్మికులకు అదనంగా వేతనం ఇవ్వాలి

జగద్గిరిగుట్ట: మున్సిపల్ కార్మికులకు అదనంగా వేతనంతో కూడిన ఒకరోజు సెలవులు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ డిమాండ్ చేసింది. గురువారం జగద్గిరిగుట్టలో నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. యేసు రత్నం హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్, పారిశుద్ధ్య కార్మికులు, అన్ని రంగాలకు చెందిన కార్మికులు సుమారుగా 15 రోజుల నుంచి మండపాల వద్ద శుభ్రం చేయడంతో పాటు ప్రతి చెరువు వద్ద రాత్రింబవళ్లు పని చేశారన్నారు. ఈ నేపథ్యంలో కార్మికులందరికీ వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ రాష్ట్ర నాయకులు రాములు, వి. హరినాథ్, కేశవులు, కత్తుల దుర్గయ్య, కమల, ఉమారాణి హనుమకొండ జిల్లా మున్సిపల్ అధ్యక్షులు వేల్పుల సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీని విమర్శించే అర్హత వారికి లేదు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

సుభాష్‌నగర్: రాహుల్ గాంధీని విమర్శించే అర్హత లేదని బీజేపీ నాయకులకు లేదని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు, రాహుల్ గాంధీపై కేంద్ర సహాయ మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టు, బీజేపీ నాయకుడు సంజయ్ గైక్వాడ్ చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా గురువారం దూలపల్లిలోని మైనంపల్లి హన్మంతరావు నివాసంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సిక్కులతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మైనంపల్లి రోహిత్ మాట్లాడుతూ ఒక ప్రజా నాయకుడిని టెర్రరిస్టు, రాహుల్ గాంధీ భారతీయుడు కాడంటూ ఆరోపణలు చేసిన బీజేపీ నాయకులను వెంటనే పార్టీ, పదవుల నుంచి తప్పించి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇలాంటి వారిని కేబినెట్ నుంచి తప్పించాలన్నారు. గాంధీ కుటుంబంలో ఉన్న అందరూ ప్రజల శ్రేయస్సుకు పాటుపడ్డారని. అలాంటి వారిని దూషించే హక్కు బీజేపీ నాయకులకు లేదని మండిపడ్డారు. రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి రవ్‌నీత్ సింగ్. బీజేపీ నాయకులు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడు శ్రీధర్ వ్యాఖ్యలు సిగ్గుచేటు


నిరసనలో సంఘం నాయకులు

సుభాష్‌నగర్: మహిళా కార్పొరేటర్‌పై కాంగ్రెస్ నాయకుడు శ్రీధర్ అనుచితంగా వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని వికలాంగుల సంఘం నాయకులు మండిపడ్డారు. గురువారం స్థానిక కాంగ్రెస్ నాయకుడు శ్రీధర్ మహిళా కార్పొరేటర్‌ను వికలాంగురాలని దూషించాడు. దీంతో కోపోద్రిక్తులైన వికలాంగ సంఘం నేతలు నిరసన ర్యాలీ చేపట్టి శ్రీధర్ ఫొటోను చెప్పులతో కొట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా కార్పొరేటర్‌ను వికలాంగురాలివి అని అంటావా, వికలాంగులంటే నీకు అంత చులకనా అని ప్రశ్నించారు. కనీసం మహిళా కార్పొరేటర్‌తో ఎలా మాట్లాడలో కూడా తెలియదా అని నిలదీశారు. ఈ నిరసన కార్యక్రమంలో వికలాంగ సంక్షేమ సంఘం నాయకులు, ఉమా, రమేష్, వాణిలు తదితరులు పాల్గొన్నారు.

కొలన్ కాంతమ్మకు నివాళి


కొలన్ కాంతమ్మకు నివాళులర్పిస్తున్న మైనంపల్లి

నిజాంపేట్: ప్రగతినగర్ కేజీఆర్ కన్వెన్షన్ హాల్‌లో గురువారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొలన్ గోపాల్‌రెడ్డి మాతృమూర్తి కొలన్ కాంతమ్మ దశదిన కర్మను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు తదితరులు హాజరై కాంతమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు.

పోలీసుల చెంతకు తప్పిపోయిన చిన్నారి



సుభాష్‌నగర్: తప్పిపోయిన ఓ చిన్నారి పోలీసుల చెంత చేరిన ఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. గురువారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో సూరారం ఓంజెండా సమీపంలో ఏడూస్తూ ఓ చిన్నారి స్థానికులకు కనిపించింది. స్థానికులు చిన్నారి తల్లిదండ్రులు, ఇంటి అడ్రస్ గురించి అడిగినా సరిగ్గా సమాధానం చెప్పలేకపోయింది. దీంతో చిన్నారిని సూరారం పోలీసులకు అప్పగించగా తల్లిదండ్రుల జాడ కనుగొనేందుకు పోలీసులు ప్రయత్నాలు ప్రారంభించారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు చర్యలు


హెచ్‌ఏఎల్ కాలనీని సందర్శిస్తున్న విద్యుత్ లైన్ ఇనెస్పెక్టర్లు

కుత్బుల్లాపూర్: హెచ్‌ఏఎల్ రాఘవేంద్ర కాలనీలో నెలకొన్న విద్యుత్ సమస్య పరిష్కారానికి అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం చర్యలు చేపట్టారు. జీడిమెట్ల డివిజన్ పరిధిలోని హెచ్‌ఏఎల్‌కాలనీలో లోఓల్టేజీ సమస్యతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని, ట్రాన్స్‌ఫార్లను ఏర్పాటు చేయాలని స్థానిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు కుంట సిద్ధిరాములు ఇటీవల మేడ్చల్ డీఈ శ్రీనాథ్ రెడ్డిని కలిసి విన్నవించగా ఆయన సంబంధిత సిబ్బందిని గురువారం కాలనీకి పంపించారు. దీంతో లైన్ ఇన్‌స్పెక్టర్లు అనిల్ కుమార్, శివప్రసాద్, రమేష్ రెడ్డి తదితరులు కాలనీలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం వారం రోజుల్లో చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఫిర్యాదు చేయగానే వచ్చి మా సమస్య పరిష్కారానికి చొరవ తీసుకున్న డీఈ శ్రీనాథ్ రెడ్డికి కాలనీ సంక్షేమ సంఘం తరఫున కుంట సిద్ధిరాములు, సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

లీకేజీలతో తాగునీరు వృథా..!

ఫిర్యాదులను పట్టించుకోని జలమండలి అధికారులు


వృథాగా పోతున్న గోదావరి జలాలు


ట్రాఫిక్ ఐలాండ్ వద్ద లీకవుతున్న తాగునీరు

రంగారెడ్డినగర్: తాగునీటి పైపులైన్ల లీకేజీలను జలమండలి అధికారులు పట్టించుకోకపోవడంతో నీరు వృథాగా పోతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. షాపూర్‌నగర్‌లోని జలమండలి ట్యాంక్ నుంచి కుత్బుల్లాపూర్, చింతల్ పరిసర ప్రాంతాలకు తాగునీటిని సరఫరా చేస్తున్న 450 ఎంఎం డయా పైపులైన్‌కు నెలరోజుల క్రితం కుత్బుల్లాపూర్ సర్కిల్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం సమీపంలో ట్రాఫిక్ ఐలాండ్ వద్ద లీకేజీ ఏర్పడింది. లీకవుతున్న నీరు కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయ రోడ్డు వెంబడి వృథాగా పారుతోంది. ప్రతినిత్యం ఇదే రోడ్డు గుండా జలమండలి అధికారులు రాకపోకలు సాగిస్తున్నా లీకేజీని పట్టించుకున్న పాపాన పోవడం లేదు. దీంతో చౌరస్తా ప్రాంతంలో రోజుల తరబడి లీకేజీ నీరు చేరడంతో చిన్నపాటి మడుగులా మారింది. కోట్లాది నిధులు వెచ్చించి నగర ప్రజల దాహార్తిని తీర్చేందుకు తీసుకువచ్చిన గోదావరి జలాలు ఇలా రోడ్డు పాలవడంపై అటుగా రాకపోకలు సాగించే ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా జలమండలి ఉన్నతాధికారులు స్పందించి ప్రధాన పైపులైన్‌కు తలెత్తిన లీకేజీకి మరమ్మతులు చేపట్టి తాగునీటి వృథాకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

తప్పు లేకపోయినా చితకబాదారు!


రమేష్‌నాయక్

జీడిమెట్ల: తప్పులేకపోయిన పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లి తీవ్రంగా కొట్టి చేయి విరగొట్టారని ఓ వ్యక్తి పోలీసులపై తీవ్ర ఆరోపణలు చేశాడు. బాధితుడు రమేష్‌నాయక్ (38), అలియాస్ రాము, అలియాస్ అజ్మీరాసాగర్ వివరాల ప్రకారం.. గత ఐదు రోజుల క్రితం షాపూర్‌నగర్‌లోని కల్లు కంపౌండ్‌లో రమేష్ మద్యం సేవిస్తుండగా అక్కడ ఇద్దరు వ్యక్తులు డబ్బుల విషయంలో గొడవపడ్డారని తాను మధ్యలో వెళ్లి వారిని సముదాయించానని తెలిపాడు. అదే సమయంలో 100 ద్వారా సమాచారం అందుకున్న జీడిమెట్ల పోలీసులు విచారించకుండానే తనను స్టేషన్‌కు తీసుకెళ్లి విపరీతంగా కొట్టారని రమేష్‌నాయక్ మీడియాకు తెలిపాడు. కాగా ఈ వీడియో సోషల్‌మీడియాలో చక్కర్లు కొట్టింది.

అతను పాతనేరస్తుడు.. ఏటీఎం చోరీ కేసులో నిందితుడు..

ఈ విషయమై జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్‌ను సాక్షి వివరణ కోరగా సదరు వ్యక్తి 2022 నవంబర్ 26న రాత్రి ఎస్‌బీఐ ఏటీఎంలో నుంచి డబ్బులు దొంగిలించాడని ఈ కేసులో నిందితుడని రిమాండ్ చేసినట్లు తెలిపారు. కాగా రమేష్ నాయక్ గతంలో అతని పేరు అజ్మీరా సాగర్ అని పేర్కొన్నాడని ఐదురోజుల క్రితం కల్లు కంపౌండ్ వద్ద రమేష్ దొంగతనం చేశాడని బాధితుని ఫిర్యాదు మేరకు స్టేషన్‌కు తీసుకెళ్లగా రమేష్ గొడకు తల గుద్దుకోవడానికి ప్రయత్నించగా ఇంటికి పంపించామని తెలిపారు. ఇదే కేసులో స్టేషన్‌కు పిలిస్తే పోలీసులపై లేనిపోని నిందలు వేస్తున్నాడని సీఐ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిజాంపేట్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ నేపథ్యంలో బాచుపల్లి సెక్షన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని ఏఈ శాంతకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ సాయి నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వీఎన్‌ఆర్ కళాశాల, వాసవీ అర్బన్, వీఎన్‌ఆర్ స్కూల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుదాం

దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరావు

దుండిగల్: పరిసరాల పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజల భాగస్వామం ఎంతో అవసరమని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరావు అన్నారు. స్వచ్ఛత హీ సేవా–2024 కార్యక్రమంలో భాగంగా గురువారం దుండిగల్ మున్సిపల్ డీపోచంపల్లి 8వ వార్డులోని బస్తీ దవాఖానా పరిసరాల్లో రోడ్లపై చెత్తా చెదారాలను తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ సత్యనారాయణరావు మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే చాలా వరకు రోగాలు దరిచేరవని, ఇళ్ల సమీపంలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఉద్యమంలా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా మున్సిపల్ సిబ్బంది ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పద్మారావు, కౌన్సిలర్లు సుంకరి కృష్ణ, సాయియాదవ్, బండారి మహేష్‌యాదవ్, మేనేజర్ సునంద, ఎన్విరానిమెంట్ ఇంజినీర్ సాత్విక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రామచందర్, అంజయ్య, వార్డ్ ఆఫీసర్స్, జవాన్లు పాల్గొన్నారు.

జిల్లాలవారీగా ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి

నిజాంపేట్: జిల్లాల వారీగా ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని మాజీ మంత్రి చంద్రశేఖర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ గురువారం బాచుపల్లి సాయినగర్‌లో చేపట్టిన మాదిగల మేలుకొలుపు యాత్రను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్, దళిత బహుజన సమితి రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జున్‌లు మాట్లాడుతూ మాదిగల జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్ కల్పించాలని. వర్గీకరణకు తెలంగాణ ప్రభుత్వం కమిటీని వేయడం హర్షణీయమన్నారు.30 సంవత్సరాల క్రితం పెట్టిన 7శాతం రిజర్వేషన్ డిమాండ్ ఇప్పుడు అమలు చేస్తే మాదిగలకు తీవ్ర నష్టం జరుగుతుందని, పెరిగిన జనాభాకు అనుగుణంగా వర్గీకరణ చేయాలన్నారు. ప్రభుత్వ మంత్రివర్గంలో, నామినేటెడ్ పోస్టుల భర్తీలో మాదిగలు, లంబాడీలు, మాలలకు, ముదిరాజులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ యాత్ర చివరి రోజు ఈ నెల 30న భువనగిరిలో ముగింపు సభ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మల్లికార్జున్, సతీష్ మాదిగ, బచ్చలకూర బాలరాజు, బీఎస్‌ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్, మాదిగ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి మోదుగు జోగారావు, గ్రేటర్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు జేరిపోతుల సాయన్నమాదిగ, మాదిగ జేఏసీ ఓయూ అధ్యక్షుడు జోగు గణేష్, కళాకారులు తదితరులు పాల్గొన్నారు

'జమిలి'తో స్వయం ప్రతిపత్తికి విఘాతం

రంగారెడ్డినగర్: జమిలి ఎన్నికలతో రాష్ట్రాల స్వయం ప్రతిపత్తికి తీవ్ర విఘాతం కలిగిస్తాయని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు యూసుఫ్ అన్నారు. గురువారం షాపూర్‌నగర్‌లోని ఏఐటీయూసీ కార్యాలయంలో జలిమి ఎన్నికలు, హైడ్రా పనితీరుపై సీపీఐ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూసుఫ్ మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఒకే దేశం ఒకే ఎన్నికలు అనే నినాదంతో దేశంలో నెలకొన్న సమస్యలను ప్రజల దృష్టి నుంచి మరల్చడానికి వేసిన ఎత్తుగడ అన్నారు. చెరువులు, కుంటలు, పార్కులు, ప్రభుత్వ భూములు కాపాడటానికి ఏర్పడిన హైడ్రా ప్రారంభంలో బాగా పనిచేసినా, ఆ తరువాత పనితీరులో మార్పు వచ్చిందన్నారు. పేదల ఇళ్లను కూల్చడంతో శ్రద్ధ చూపుతున్న హైడ్రా అధికారులు బడాబాబులు, రాజకీయ నాయకుల కబ్జాలను కూల్చడంలో వెనుకంజ వేస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు స్వామీ, నియోజకవర్గ కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సింగిరెడ్డి మాధవరెడ్డి సేవలు మరువలేనివి

దుండిగల్: స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమకారుడు సింగిరెడ్డి మాధవరెడ్డి సేవలు రాష్ట్ర ప్రజలు మరువరని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. గురువారం భౌరంపేట్‌లో నిర్వహించిన మాధవరెడ్డి 15వ వర్ధంతి కార్యక్రమానికి వికారాబాద్ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పట్నం సునీత మహేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాడు నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సింగిరెడ్డి మాధవరెడ్డి అవిశ్రాంతంగా పోరాటం చేశారని, అదే విధంగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో తనదైన ముద్ర వేశారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బస్సు డ్రైవర్ సడన్ బ్రేక్.. విద్యార్థినికి గాయాలు

కుత్బుల్లాపూర్: ఆర్టీసీ బస్సు డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో ఇంజినీరింగ్ విద్యార్థిని గాయాలైన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ... మైసమ్మగూడలోని మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్‌ఇ సెకండ్ ఇయర్ చదువుతున్న చెన్న కీర్తన గురువారం సాయంత్రం కళాశాల ముగిసిన అనంతరం ఇంటికి వెళ్లేందుకు ఇసీఐఎల్ డీపోకు చెందిన (ఏపీ1126325) ఆర్టీసీ బస్సు ఎక్కింది. ఈ క్రమంలో బస్సు డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో విద్యార్థి కీర్తన రోడ్డుపై పడగా ఆమె కాలు మీదుగా బస్సు ముందుకు చక్రం వెళ్లడంతో తీవ్ర రక్తస్రావం అయింది. వెంటనే సూరారం మల్లారెడ్డి నారాయణ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే తమ కుమార్తె గాయపడిందని, క్షతగాత్రురాలి తండ్రి రమేష్‌గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గణేశ్ లడ్డూకి లక్కీ డ్రా

నిజాంపేట్ కార్పొరేషన్ రెండో డివిజన్‌లోని ఆనందనాయుడు లేఅవుట్‌లో గురువారం గణేశ్ లడ్డూ లక్కీ డ్రా నిర్వహించారు. ఈ డ్రాలో కాలనీకి చెందిన బలరామ్ లడ్డూను సొంతం చేసుకున్నారు.

– నిజాంపేట్


లక్కీ డ్రాలో గణేశ్ లడ్డూను సొంతం చేసుకున్న బలరామ్